క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలో 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సిబ్బంది శనివారం మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యతో మూడు వార్డులకు శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వృద్ధులు, పిల్లలు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యుల ద్వారా సమాచారం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గోపాలరావు, విద్యుత్ లైన్ ఇన్స్‌పెక్టర్ షరీఫ్, సిబ్బంది భద్రం, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా పోస్టర్ల ఆవిష్కరణ

పెనుబల్లి: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 29న ఎస్ఆర్ గార్డెన్‌లో జరిగే మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని పొంగులేటి వర్గీయ నాయకులు అన్నారు. శనివారం మండలంలో జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. వంద కంపెనీలలో 10 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వీటిని నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, మాధవరెడ్డి, దామోదర్, రమేష్, మాధవరావు, బాజీ, అబ్బాస్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం


మేకల రమేష్

ఎర్రుపాలెం: జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి మండల కన్వీనర్‌గా మేకల రమేష్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ కన్నెబోయిన కేశవులు ఆదేశాలతో రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి నియామక పత్రం జారీ చేశారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొండపల్లి రవి తెలిపారు. ఎంపికైన బూసి కీర్తి, కుంచం పావని లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

వడ దెబ్బపై అవగాహన

కల్లూరు రూరల్: వడ దెబ్బ, కేన్సర్, షుగర్ తదితర అంశాలపై సేవానిలయం పెద్దకోరుకొండి హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. చెన్నూరు, చిన్నకోరుకొండి, తాళ్లూరు, వెంకటాపురం గ్రామాల్లో మైకు, కరపత్రాలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సుజా, లోస్సీ, జనిత, మర్సిన్, శాంతి, ప్రేమ పాల్గొన్నారు.

ఎన్డీ సీనియర్ కార్యకర్త మృతి

కొణిజర్ల: మండలంలోని రామనరసయ్యనగర్ గ్రామానికి చెందిన సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ కార్యకర్త నీలాల ఏసు(60) శనివారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని ఎన్డీ రాష్ట్ర సెక్రటరీయేట్ సభ్యుడు మధు, అరుణోదయ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న, పార్టీ ఖమ్మం, వైరా డివిజన్ కార్యదర్శులు లక్ష్మీనారాయణ, ఖాసీం, పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి విప్లవ్‌కుమార్, ఎన్డీ డివిజన్ నాయకుడు గిరి, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి రాజేందర్ తదితరులు సందర్శించి మృతదేహంపై పార్టీ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాషా, కిషన్, ఖాసీమ్‌ఖాన్, బాబు పాల్గొన్నారు.

గోపి సేవలు చిరస్మరణీయం

తల్లాడ: ప్రజా ఉద్యమాలలో పాల్గొని ప్రజల హృదయాల్లో నిలిచిన గోపి చిరస్మరనీయుడని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. తల్లాడ మండలం కేశ్వాపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన గోపి సంస్మరణ సభ శనివారం మన్నేపల్లి రామారావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో సీపీఎం సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాచర్ల భారతి, సీపీఎం సీనియర్ నాయకుడు బాస్కర్‌రావు, సీపీఎం మండల కార్యదర్శి రామలింగేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, అర్జున్‌రావు, శ్రీనివాసరావు, నాగయ్య, సాలిక సాకేత్ పాల్గొన్నారు.

23న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మధిర: మధిర మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23న ఉదయం 10:30 గంటలకు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ సీలార్ సాహెబ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి వచ్చి అభివృద్ధి పనుల వివరాలను తెలపాలని, ప్రజా ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చే సమస్యలను తెలుసుకోవాలని సూచించారు.

పూర్తయ్యేదెన్నడో..?


ప్రమాదకరంగా ఉన్న అయ్యవారిగూడెం - భీమవరం వంతెన

- అసంపూర్తిగా కల్వర్టుల నిర్మాణం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

అధికారుల పర్యవేక్షణలోపం, పాలకుల నిర్లక్ష్యం కారణంగా పలు గ్రామాల మధ్య ఉన్న వంతెనల నిర్మాణం పూర్తికావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వంతెనలు నిర్మించినా పనులు అసంపూర్తిగా ఉండటంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. కోట్ల రూపాలయు వెచ్చించినా పనులు పూర్తి కాక పోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఏళ్ల తరబడి ఇలాగే ఉన్నా వాటిని పట్టించుకున్న వారే కరువయ్యారు.

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు - భీమవరం గ్రామం వరకు బీటీ రోడ్డు విస్తరణ జరిగింది. ఈ ప్రధాన రహదారిలో గత మూడేళ్ల క్రితం ప్రభుత్వం పన్నెండు కల్వర్టుల నిర్మాణాలకు రూ.3 కోట్ల నిధులు మంజూరు చేసింది. పన్నెండు కల్వర్టుల నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా.. అందులో 8 కల్వ ర్టులను అసంపూర్తిగా నిర్మాణాలు చేపట్టారు. మిగతా వాటికి శ్లాబులు మాత్రమే వేసి వదిలేశారు. ఇటీవల అయ్యవారిగూడెం - భీమవరం గ్రామాల మధ్య నిర్మించిన కల్వర్టుకు శ్లాబు మాత్రమే వేసి ఆ పక్కనే అధ్వానంగా మరో అధ్వానపు దారి నిర్మించారు. ఈ కల్వర్టు దగ్గర ఇరువురు వ్యక్తులు ప్రమాదాలకు గురై మృత్యువాతపడగా పలువురు గాయాలపాలయ్యారు. ఈ క్రమంలో అన్ని రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఈ కల్వర్టుల దగ్గర ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. పాలకులు, అధికారులు మాత్రం కనికరించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న ఈ కల్వర్టుల నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కల్వర్టుల వద్ద కలవరం..

పలు గ్రామాల్లో ఉన్న కల్వర్టులు అసంపూర్తిగా ఉండడంతో పాటు, కొన్నింటికి రిటైనింగ్ వాల్స్ కూడా పూర్తి చేయలేదు. ఇనుప సువ్వలే దర్శనమిస్తున్నాయి. కనీసం హెచ్చరిక బోర్డులను కూడా అధికారులు ఏర్పాటు చేయలేదు. అప్రోచ్ రోడ్లు లేకపోవడంతో ద్విచక్ర వాహన చోదకులు ప్రయాణించాలంటే నరకం చూస్తున్నారు.

వంతెన పూర్తి చేయాలి..



ఏళ్ల తరబడి వంతెన కోసం నిరీక్షించాం. నిధులు మంజూరై వంతెన నిర్మాణం పూర్తయితే రాకపోకలకు ఇబ్బందులు లేవనుకున్నాం. వంతెన నిర్మించినా పూర్తి స్థాయిలో పనులు చేయలేదు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పనులను వెంటనే పూర్తి చేయాలి.

– గోసు రామారావు, సర్పంచ్, అయ్యవారిగూడెం

ఆందోళనలు చేస్తాం..



అసంపూర్తి కల్వర్టులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. సంవత్సరాల తరబడిగా నిర్మాణాలు నిలిచిపోతే అధికారయంత్రాంగం ఎందుకు పట్టించుకోవడం లేదు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాటడం సరికాదు. ఇప్పటికైనా స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

– దివ్వెల వీరయ్య, సీపీఎం మండల కార్యదర్శి, ఎర్రుపాలెం

ప్రతిపాదనలు పంపించాం..



కల్వర్టు నిర్మాణాలకు సంబంధించిన పాత కాంట్రాక్టర్ టెండర్‌ను రద్దు చేశామని, మరోసారి టెండర్‌ను పిలిపించేందుకు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణాలకు కూడా మరో రెండు కోట్ల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు.

– రాజేష్, ఆర్‌అండ్‌బీ ఏఈ, ఎర్రుపాలెం

సబ్సిడీ విత్తనాలను వినియోగించుకోవాలి


సబ్సిడీ విత్తనాలను రైతుకు అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

పెనుబల్లి: తెలంగాణ ప్రభుత్వం రైతాంగానికి అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వం 60 శాతం సబ్సిడీపై అందిస్తున్న జీలుగు విత్తనాలను మండలంలోని పాతకారాయిగూడెం సొసైటీ గోదాంలో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.5 కోట్ల నిధులతో జీలుగు విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేస్తున్నట్లు, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, వెంకటేశ్వరరావు, చెన్నారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఉమామహేశ్వరరావు, ఆత్మా కమిటీ చైర్మన్ వాసు, కర్నాటి వీరభద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం


తల్లాడ ప్రభుత్వ ఆస్పత్రి సమీక్షలో పాల్గొన్న ఎంపీపీ, ఎంపీడీఓ, వైద్యులు

తల్లాడ: తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల పరీక్షలు అందుబాటులోకి వచ్చాయని ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అన్నారు. తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రభుత్వ వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుందన్నారు. బీపీ, థైరాయిడ్, కొలెస్ట్రాల్, కిడ్నీ, లివర్, రక్త కణాలు, టైఫాయిడ్ డెంగీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం మినహాయించి మిగతా అన్ని రోజుల్లో ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డ్, మొబైల్ నంబర్ తీసుకొస్తే పరీక్షలు నిర్వహించి రిపోర్టు మరుసటి రోజు తెలియజేస్తారని అన్నారు. ఆస్పత్రిలో జరుగుతున్న మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ రత్న మనోహర్, ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, ఎంఈఓ ఎన్.దామోదరప్రసాద్, డాక్టర్ నీలిమ, కిరణ్‌బాబు, ఆదూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, నాయకులు

తల్లాడ: హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మండలంలోని రంగంబంజర, మల్సూర్‌తండా గ్రామాల్లో శనివారం మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంభాని మాట్లాడుతూ.. యువతకు భవిత, అమరుల ఆశయ సాధనే కాంగ్రెస్ విధానంగా యూత్ డిక్లరేషన్ ప్రకటించినట్లు తెలిపారు. 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. అందరూ కాంగ్రెస్‌ను ఆదరించాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుదాకర్, పీసీసీ అధ్యక్షులు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ డిప్యూటీ కన్వీనర్ కొండూరి కిరణ్, సత్తుపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, తల్లాడ పట్టణ అధ్యక్షులు నాగిరెడ్డి, రమేష్, అంజయ్య, వెంకటేశ్వర్లు, రోశయ్య, క్రిష్టారావు, కృష్టారెడ్డి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఆర్ సెంటర్లు ప్రారంభం


వైరా 1వ వార్డులో ప్లాస్టిక్ వ్యర్థాలు స్వీకరిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు



మధిర: ర్యాలీ ప్రారంభిస్తున్న ధనికుమార్


సత్తుపల్లిలో ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

మధిర/వైరా/సత్తుపల్లిటౌన్ : స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా అన్ని పట్టణాలను తీర్చిదిద్దేందుకు ట్రిపుల్ ఆర్ (రీయూజ్, రీసైకిల్, రెడ్యూస్) సెంటర్లను మున్సిపల్ కౌన్సిలర్ కోనా ధనికుమార్, వైరా మున్సిపల్ కమిషనర్ పతాని వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మరికంటి డేడీకుమారి, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ లు శనివారం ప్రారంభించారు. మధిర మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో, వైరా మున్సిపాలిటీ పరిధిలోని 1నుంచి 20వ వార్డుల్లో, సత్తుపల్లి పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌తో పాటు పలు వార్డుల్లో మరో ఐదు ట్రిపుల్‌ఆర్ సెంటర్లను వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛందంగా నిరుపయోగంగా ఉన్న పలు వస్తువులను కేంద్రాల్లో అందించారు. పట్టణాన్ని అందంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, వైస్ చైర్మన్ తోట సుజలరాణి, కౌన్సిలర్లు, నాయకులు ఎస్‌కె చాద్‌పాషా, నాగుల్‌మీరా, నరుకుళ్ల శ్రీనివాసరావు, మేకల నర్సింహారావు, మెప్మా ప్రసాద్, ఆర్పీలు అశ్విని, వసంత, జాన్సీ, మున్సిపల్ సిబ్బంది సుందర్ రావు, మెప్మా ఆర్పీ కృష్ణవేణి, గ్రామ దీపికలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

మధిర: మధిర పట్టణంలోని మెయిన్ రోడ్డులో పుల్లఖండం వారి శ్రీరామ టవర్స్ అధినేత పుల్లఖండం సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శనివారం ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఎండలు రోజురోజుకు మండుతుండడంతో సుదూర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజలకు వేసవి దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ అందజేస్తున్నారు. ప్రతిరోజు చల్లని నీటిని, వారానికి ఒకరోజు చల్లని మజ్జిగను పంపిణీ చేస్తుండడంతో ప్రజలు సత్యనారాయణమూర్తికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

నిరుపేదలకు అన్నదానం

మధిర: మధిర పట్టణంలోని వైరా రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మి పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఎన్ఆర్ఐ గాదె దినేష్ రెడ్డి, నాగజ్యోతి దంపతుల ఆర్థిక సహకారంతో నిరుపేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు గొండేల ముత్తయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో వజ్రాల శ్రీనివాసరెడ్డి, మాధురి, కటకం నరసింహారావు, గంగవరపు వీరారెడ్డి, తాళ్లూరి కృష్ణసూరి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

వైరారూరల్: మండలంలోని కొండకొడిమ గ్రామంలోని వృద్ధులకు సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి సంస్థ బాధ్యులు రెబ్బవరం గ్రామీణ బ్యాంకు ఉద్యోగి, సరిత, మెడికల్, కిరాణ షాపు యజమానులు రామకృష్ణ, సందీప్ కుమార్‌ల సహకారంతో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు


వైరా శాంతినగర్‌లో రిలే దీక్షలు చేస్తున్న ఇనాం భూముల వారసులు

వైరా: వైరా మున్సిపాలిటీ 14వ వార్డు శాంతినగర్ ఎస్సీ కాలనీలోని బల్వతి ఇనాం పట్టా భూములను కాపాడాలని కోరుతూ ఆయా పట్టాదారుల వారసులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు రెండో రోజు శనివారం కూడా కొనసాగాయి. 9 మంది ఇనాం దారుల వారసులు ఉన్నారని ఇనాం భూముల్లో ఉన్న అక్రమ కట్టడాలకు కూల్చి వేసి ఇనాం దారుల వారసులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పమ్మి తిరుమలరావు, కొమ్ము నాగేశ్వరరావు, మోదుగు విజయ్ పమ్మి ప్రేమ్ కుమార్, కొమ్ము రాంబాబు, కాంపల్లి భూపతిరావు, కర్లకంటి నవీన్, దాసు, విజయ్, సురేష్, నాగరాజు, వెంకటమ్మ, కోటయ్య, సీతమ్మ, దేవకర్ణ, వాసు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

కొణిజర్ల: వీఆర్ఏలను రెగ్యులర్ చేస్తూ సీఎం కేసీఆర్ ప్రకటించడంతో కొణిజర్లలో శనివారం వీఆర్ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణ, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి జానీవియా, ట్రెజరర్ సైదా, ధనలక్ష్మి, పద్మ, పాషా, గోపాల్, శ్రీలక్ష్మి, సైదులు, రియాజ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కంఠమహేశ్వరుడి కల్యాణం


బోనకల్: ముష్టికుంట్లలో జలబిందెలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో కంఠమహేశ్వరుడు – సురమాంబాదేవి కల్యాణ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం జలబిందెలతో ఊరేగింపు నిర్వహించారు. పూజల అనంతరం కంఠమహేశ్వరుడికి బోనాలు సమర్పించారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గౌడ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

వల్లభిలో హోమం..

ముదిగొండ: మండలంలోని వల్లభిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో శనివారం పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన తదితర పూజా కార్యక్రమాలను మట్టపల్లి మల్లిఖార్జునశర్మ, మహంకాళి రామప్పశాస్త్రి, మట్టపల్లి రామప్పశాస్త్రి, బలగం భార్గవ్‌శర్మలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదముల వితరణ గావించారు.

సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సమస్యలపై సింగరేణి పీఓలతో చర్చిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలలో పని చేస్తున్న సింగరేణి కార్మికుల సమస్యలపై శనివారం కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ పీఓలు వెంకటాచారి, నర్సింహారావులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీవీ నరసింహారావు కాలనీలో నీళ్లు, రోడ్లు, డ్రైయినేజీ, దుమ్ము లేవకుండా రోడ్లుపై వాటర్ స్ప్రే చేయించే విషయంపై చర్చించటం జరిగిందన్నారు. ఉద్యోగుల టీఏ, డీఏ బిల్లుల అంశం, పెండింగ్ ఇంక్రిమెంట్లు ఇప్పించాలని కోరారు. కిష్టారం ఓసీలో వెల్డింగ్ షెడ్, రెస్టరూంలు, బేస్ వర్క్‌షాప్, బైక్ షెడ్లు అన్ని తొందరగా పూర్తి చేయాలని వీటితో పాటు పలు సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ బొంతు రమేష్‌బాబు, జేవీఆర్ ఓసీ పిట్ ఇన్‌చార్జ్ ఉపేంద్రాచారి, తీగల క్రాంతికుమార్, కిష్టారం ఓసీ సెక్రటరీ గద్దె మురళీ, రుద్రంపూర్ సర్పంచ్ గుమ్మడి సాగర్, ఆర్‌సీహెచ్‌పీ శంకర్‌బాబు, బ్రాంచ్ సెక్రటరీ శ్రీనివాస్, సీఈఆర్ క్లబ్ సెక్రటరీ శ్రీనివాసరావు, కంచె శ్రీనివాస్ కోటేష్, నాగప్రకాష్, అఖిల్, అశ్ఫక్, రఫీ, యాకూబ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చింతకాని: మండలంలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన లబ్ధిదారులు మాతంగి వెంకటేశ్వర్లు, టేకుమట్ల వెంకటేశ్వర్లకు శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎల్పీ నేత, మధిర శాసనసభ్యుడు మల్లు భట్టి విక్రమార్క సిఫారసుతో మంజూరైన రూ.48 వేల సీఎంఆర్ ఎఫ్‌చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ ప్రసాద్‌రావు, శేషగిరిరావు, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, కుటుంబరావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో బీజేపీ నాయకుల పర్యటన


డ్రెయిన్‌లో నిలిచిన చెత్తను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

మధిర: మధిర పట్టణంలోని లడక బజారు సమీపంలో కల్వర్టును నిర్మించాలని బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం బీజేపీ మధిర పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సాయిబాబా గుడి రోడ్డు, లడక బజార్, రైల్వే అండర్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను పరిశీలించారు. లడక బజార్‌లో సీసీ రోడ్డు నిర్మించి కల్వర్టును నిర్మించకపోవడంతో డ్రెయిన్‌లో చెత్త పేరుకుపోయి మురుగునీరు ముందుకు కదలడం లేదన్నారు. అనంతరం రైల్వే అండర్ బిడ్జి నుంచి వెళ్తున్న డ్రెయిన్‌లో పూడికను తొలగించడం లేదని, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్సిపాలిటీ కుళాయిలకు పలుచోట్ల లీకేజీలు ఉండి మురుగునీటితో కలుషితం అవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ అధ్యక్షుడు పాపట్ల రమేష్, రామకృష్ణ, నాగభూషణం, నాగేంద్రబాబు, రాము, ఖాజామియా, ప్రభుదాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు పరిశీలన..

ఎర్రుపాలెం: మండలంలోని పెద్ద గోపవరంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడు నూతక్కి నరసింహారావు, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కపాటి శ్రీనివాసరావులు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న ఈజీఎస్ పథకంతో ఎంతో మంది పేద కూలీలకు మేలు జరుగుతుందని తెలిపారు. మోదీ అమలు చేస్తున్న పలు పథకాలపై కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళేశ్వరరావు, వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, ఏడుకొండలు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

27న బీజేపీ నిరుద్యోగ మార్చ్


సత్తుపల్లిరూరల్: మాట్లాడుతున్న బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ రామలింగేశ్వరరావు

మధిర/వైరా/సత్తుపల్లిరూరల్: ఖమ్మంలో ఈ నెల 27న బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, బీజేపీ వైరా అసెంబ్లీ కన్వీనర్ కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ నాయక్ రాష్ట్ర గిరిజన మోర్చా ఐటీ సెల్ కన్వీనర్ బీపీ నాయక్‌లు పిలుపునిచ్చారు. శనివారం సత్తుపల్లిలోని బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ బాస్కర్ల వీరంరాజు అధ్యక్షతన విలేకరుల సమావేశంలో.. మధిరలోని స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో, వైరాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగులను మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. అన్ని మండలాల నుంచి నిరుద్యోగులు, విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ నిరుద్యోగ మార్చ్ కార్యక్రమాన్ని విజయవం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి విజయరాజు, జిల్లా కార్యదర్శి సాంబశివరావు, చంద్రశేఖర్ రెడ్డి, రమేష్, మోహన్‌రావు, బీజేపీ వైరా టౌన్ అధ్యక్షుడు ఏలే భద్రయ్య, ప్రధాన కార్యదర్శి మనుబోలు వెంకటకృష్ణ, నరేష్, రాంబాబు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఉడతనేని అప్పారావు, జిల్లా కార్యదర్శులు నాయుడు రాఘవరావు, సుదర్శన్‌మిశ్రా, మండల అధ్యక్ష, కార్యదర్శులు పాలకొల్లు శ్రీనివాస్, ఆచంటి నాగస్వామి, బొర్రా నర్సింహారావు, చిన్నికృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఆగని ఇసుక దందా



ముదిగొండ మండలం గంధసిరి, పెద్దమండవ సమీపంలోని మున్నేరులో నుంచి ఏలాంటి అనుమతులు లేకుండా నిత్యం ఇసుకను తరలిస్తున్నారు. రోడ్లపై అతి వేగంగా ఇసుక ట్రాక్టర్లు దూసుకుపోవడంతో పలు వాహనదారులు భయబ్రాంతులకు గురౌతున్నారు. సంభందిత శాఖల సిబ్బంది చేతివాటం ప్రదర్శించడంతో రోజుకు పదుల సంఖ్యలో రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని వాపోతున్నారు. అరకొర దాడులతో ఒకటి రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేసి జరిమానా విధించి వదిలేస్తున్నారు. వేసవిలో ఇలా ఇసుకను తరలిస్తుండడంతో గ్రామాల్లోని బోరు బావులు అడుగంటి పోతున్నాయని వారు వాపోతున్నారు. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

– ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : సంజయ్‌కుమార్, మైనింగ్ ఏడీ, ఖమ్మం
సెల్ నంబర్ : 96031 34117